ఘనంగా భోగి వేడుకలు

- తెల్లవారుజాము నుంచే మొదలైన పండుగ సందడి
- సంప్రదాయబద్ధంగా భోగి మంటలు, ముగ్గులు పోటీలు
- దుర్గుణాలను మంటల్లో కలిపి సద్గుణాలు రావాలని పూజలు




కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోగిమంటలు, గోవుకు దాణా తినిపిస్తున్న మహిళ



నగరంలోని ఓ ఇంటి ముందు వేసిన సంక్రాంతి ముగ్గు

కర్నూలు (కల్చరల్/హాస్పిటల్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో మొదటి రోజు ఆదివారం భోగి సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ఎదుట అందమైన రంగవల్లులను తీర్చి దిద్ది గొబ్బెమ్మలను పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. గోమాత పూజ, చిన్నారులకు భోగిపళ్ల పోయడం, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు విశేషంగా అలరించాయి. పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. తెల్లవారు జామునే ఇంట్లోని పాత వస్తువులన్నింటినీ భోగి మంటల్లో వేసి పాత వస్తువులతో పాటు కష్టాలు బూడిదవ్వాలని దుర్గుణాలు సైతం మంటల్లో కలిసిపోయి సద్గుణాలు రావాలని వేడుకుంటూ చిన్నా పెద్ద తేడా లేకుండా నృత్యాలు ప్రదర్శించారు. చిన్న పిల్లలపై రేగు పళ్లు, పూలు, శనగలు, చిల్లర నాణేలను పోసి కనుదిష్టి తీశారు. గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసేలా వేడుకలు సాగాయి. రైతులు తాము పండించిన పంటలు ఇళ్లకు చేరడంతో పండుగను సంతోషంగా జరుపుకున్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో భోగి వేడుకలు నిర్వహించారు. జగన్నాథ్ బలదేవ్, సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం అధ్యక్షులు నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏక్యాంప్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు భోగి వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

అందరి ఇంటా భోగభాగ్యాలు కలగాలి

అందరి ఇంటా భోగభాగ్యాలు కలగాలని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం భోగి పండుగను పురస్కరించుకుని ఎ.క్యాంపులో ని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో భోగిమంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం హెల్త్‌క్లబ్‌లో ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నామని, ఈ సందర్భంగా సంప్రదాయ భోగివంటకాలను నేటితరానికి రుచిచూపిస్తున్నట్లు తెలిపారు. భోగిమంటలు వేయడం మన సంప్రదాయమని, తద్వారా ఈ చలికాలంలో వెచ్చదనాన్ని ఇవ్వడమే గాక జీవితంలో పాత చేదు జ్ఞాపకాలను వదులుకుని తిరిగి నూతన జీవితాన్ని ఆస్వాదించాలని భోగిమంటలు చెబుతాయన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ హేమంతకుమార్, లక్ష్మణ్, వెంకటరాముడు, కేశవరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర దేవతా మూర్తులు



సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు వైష్ణోకృప చైతన్య ప్రభు

క్లుప్తంగా

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



నోటికి బట్టకట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. 34వ రోజు ఆదివారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీలు నోటికి నల్లబట్ట కట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లపై స్పందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అన్నారు.కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా శోభన్ బాబు జయంతి వేడుకలు



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక గాంధీనగర్ వద్ద ఆదివారం సినీనటుడు శోభన్ బాబు 88 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ శోభన్ బాబు విగ్రహానికి పూలమాల వేసి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నటుడు శోభన్ బాబు చేసిన అనేక సినిమాలు మనకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, దొరబాబు, రైల్వే ప్రసాద్, యోహాన్, శ్రీను, చిన్నరాముడు, శోభన్ బాబు సేవా సమితి అభిమానులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : గుంటూరు కారం
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: గుంటూరు కారం, హనుమాన్, నా సామిరంగ, సైంధవ్, సలార్ - సీజ్‌ఫైర్, మెరీ క్రిస్మస్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : గుంటూరు కారం, హనుమాన్, నా సామిరంగ, సైంధవ్
ఐనాక్స్ : హనుమాన్, సైంధవ్, నా సామిరంగ, సలార్ – సీజ్‌ఫైర్
శ్రీరామ : గుంటూరు కారం
రాజ్ : నా సామిరంగ
విజయ : గుంటూరు కారం

వైభవంగా గోదా రంగనాథ కల్యాణం



సూర్య నారాయణ స్వామి ఆలయంలో కల్యాణం



వేడుకను తిలకిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ధనుర్మాస ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో గోదా రంగనాథ కల్యాణోత్సవం కనుల పండుగలా నిర్వహించారు. నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఆగమ పండితులు రమేష్, కిరణ్ బృందంతో కల్యాణం నిర్వహించారు. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త, ట్రస్టీ పెల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు బీసీ మద్దిలేటి, భరతమాత ఆలయం అధ్యక్షుడు సందడి మహేష్, కోశాధికారి రామసుబ్బారెడ్డి, విష్ణు సహస్రనామ సత్సంగం అధ్యక్షుడు మల్లెల పెద్ద పుల్లారెడ్డి, కొండా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గుత్తిరోడ్‌లోని శ్రీ ఛాయా ఉమాస మేత శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం, అరోరానగర్ రాజరాజేశ్వరి ఆలయం, మారుతీ నగర్‌లోని శ్రీమారుతీ రామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని లక్ష్మీ సమేత నరసింహస్వామి ఆలయం, ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, భవసార క్షత్రియ సంఘం, దండేగేరి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోదా కల్యాణాన్ని కనుల పండువలా నిర్వహించారు.

సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు



ముగ్గులను పరిశీలిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాతి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం 34వ వార్డులోని నిర్మల్‌నగర్, వాసవీనగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు 300 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు హాజరై ముగ్గులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సంక్రాతి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. వీధుల్లో ముగ్గులను చూస్తుంటే అచ్చం పల్లెటూరు వాతావరణం కనిపిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన అందిస్తున్నారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం వైఎస్సార్ చేయూత, పొదుపు సంఘాలలకు సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు.



ముగ్గుల పోటీలో మొదటి స్థానంలో నిలిచిన జమునకు డబుల్ డోర్ ఫ్రిజ్ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

విజేతలకు బహుమతులు అందజేత

ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి డబుల్ డోర్ ఫ్రిజ్‌ను జమున , రెండో బహుమతి వాషింగ్ మెషిన్‌ను ఇంద్రజ , మూడవ బహుమతి టీవీని పూజిత, నాల్గవ బహుమతి కూలర్‌ను జ్యోతి , ఐదవ బహుమతి మిక్సీని వీనాబాయి గెలుచుకున్నారు. వారికి ఎమ్మెల్యే ఆయా బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, నాయకులు రామాంజనేయులు, సుధాకర్‌రెడ్డి, పొదుపు సంఘాల ఆర్పీలు జానకమ్మ, మాధురి, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ



అభాగ్యులకు అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కర్నూలు కల్చరల్: అవధూత దత్త పీఠాధిపతులు, ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి ఆలయంలోని దేవతా పరివారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ అనాథ శరణాలయం, నరసింహారెడ్డి నగర్, పంపాస్‌లోని నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ టి. శివరామకృష్ణ, సభ్యులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ కృష్ణమోహన్, ప్రకాష్, కృష్ణమూర్తి, శ్రీదేవి, నాగజ్యోతి సుదర్శన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ స్ఫూర్తికి నిదర్శనం ప్రధాని మోదీ



ఆలయంలో శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

కర్నూలు కల్చరల్: స్వచ్ఛ స్ఫూర్తికి నిదర్శనం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నాయకులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ ద్వారా సాయి ఆలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌ను ఆవిష్కరించేందుకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. స్వచ్ఛభారత్ ద్వారా దేవాలయాలను శుభ్రం చేసే కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోకేశ్వరయ్య, కోటి యాదవ్, రామచంద్రా రెడ్డి, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో అష్టావధానం ప్రత్యేకం



అవధానం చేస్తున్న ఆముదాల మురళి

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో అష్టావధాన ప్రక్రియ ప్రత్యేకమైందని, రాయలసీమ అవధానులకు పుట్టినిల్లు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో అష్టావధాన కార్యక్రమం జరిగింది. తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి అవధానం నిర్వహించారు. పృచ్ఛకులుగా అవధానం సుధాకరశర్మ, కర్నాటి చంద్రమౌళిని, దండెబోయిన పార్వతి, మధుసూదన శర్మ, తొగట సురేష్‌బాబు, మహమ్మద్ మియ్యా, సునీత, ఇనాయతుల్లా వ్యవహరించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం కళాక్షేత్రంలో ప్రతి నెల సంగీత, సాహిత్య కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రులకు సంక్రాంతి పర్వదినం ఎంతో ప్రత్యేకమైందన్నారు. అనంతరం అవధానిని సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ వి.పోతన్న, కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): భూ యాజమాన్య హక్కు ల చట్టాన్ని రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట భూ యాజమన్యా హక్కుల చట్టం ప్రతులను సీపీఎం, సీపీఐ, ఇతర రైతుసంఘాల నాయకులు వేర్వేరుగా భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ చట్టం తయారు చేసినా న్యాయ సమీక్షకు అవకాశం ఉండాలన్నారు.జి.రామకృష్ణ, పుల్లారెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, కె.జగన్నాథం, బొల్లవరం వెంకటేశ్వర్లు, విజయకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు విజేత పంచలింగాల

గడివేముల: అక్లగడ్డ గ్రామంలో సంక్రాంతి, మౌలాలి స్వామి తిరునాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగు పోటీలు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న బ్రదర్స్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు బహుమతిని కైవసం చేసుకున్నాయి. రెండవ బహుమతి రూ.30 వేలను వైఎస్సార్ జిల్లా దాసరిపల్లి గ్రామానికి చెందిన చిన్న వీరన్న ఎద్లు, మూడవ బహుమతి రూ.20 వేలను నారాయణపేట మక్తల్ గ్రామానికి చెందిన ఏఆర్ఎం బుల్స్, నాలుగో బహుమతిని సోమయాజులపల్లెకు చెందిన యాగల నరసయ్యయాదవ్ వృషభాలు కైవసం చేసుకున్నాయి.

నగరపాలకకు గడప గడప నిధులు

- 46 అభివృద్ధి పనులకు రూ.2.30 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ డాక్టర్ జి. సృజన



నగరంలోని ఓ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



నగరపాలక కార్యాలయం

కర్నూలు (టౌన్) : నగరపాలకకు మరోసారి గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరు అయ్యాయి. కర్నూలు నియోజకవర్గంలో గుర్తించిన కాలనీల్లో 46 అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.2.30 కోట్లు మంజూరు చేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ఒక్కో సచివాలయం పరిధిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు చొప్పున విడుదల చేస్తోంది. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో కాలనీల్లో 552 అభివృద్ధి పనులకు రూ. 82. 38 కోట్లు కేటాయించారు. ఇందులో గతేడాది నుంచి మొదటి దశలో 219 పనులకు గాను రూ. 11.64 కోట్లు, రెండో దశలో 144 పనులకు రూ.10.16 కోట్లు ఖర్చు చేశారు. మిగతా పనులు కొనసాగుతున్నాయి. కొన్ని టెండర్ దశలో ఉన్నాయి.

చేపట్టనున్న అభివృద్ధి పనులు

- రూ. 5 లక్షలతో ప్రకాష్‌నగర్‌లో సీసీ డ్రైన్ నిర్మాణం
- చల్లా కాంపౌండ్ వద్ద రూ.5 లక్షలతో సీసీ రోడ్డు
- దండిగేరిలో రూ.5 లక్షలతో సీసీ డ్రైన్
- ధర్మపేటలో రూ.5 లక్షలతో మహిళలకు మరుగుదొడ్ల నిర్మాణం
- లక్ష్మీనగర్‌లో రూ.5 లక్షలతో సీసీ డ్రైన్ అభివృద్ధి
- నరసింగరావు పేటలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

అభివృద్ధి పనులకు పెద్ద పీట :

గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో స్థానిక ప్రజా ప్రతినిధులు నియోజకవర్గం పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నగరంలోని 136 సచివాలయాల పరిధిలోని ప్రజలను కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ నేరుగా కలుస్తున్నారు.వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్నారు. అలాగే ఏవైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నుంచి రూ.40 లక్షలు నిధులు కేటాయించి కల్వర్టు, పైపులైన్ లీకేజీ పనులు, డ్రైయినేజీ, సీసీ రోడ్లు వంటి పనులు చేపడుతున్నారు. కర్నూలు నియోజకవర్గం పరిధిలో ఎక్కువగా పైపులైన్ పనులు, విద్యుత్ వైర్ల సమస్యలు వస్తుండటంతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా వాటిపై దృష్టి సారించారు.

టెండర్ల ద్వారా పనులు ప్రారంభిస్తాం



రెండేళ్లుగా గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రభుత్వం నిదులు మంజూరు చేస్తుంది.ఈ నిధులతో స్థానిక ప్రజల అభ్యర్థనల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. తాజాగా మరోసారి ప్రభుత్వం 46 పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో ఈ పనులను టెండర్ల ప్రక్రియ నిర్వహించి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మంజూరైన రూ.2.30 కోట్లు కాలనీల్లో అభివృద్ధి పనులకు వెచ్చిస్తాం.

– షాకీర్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్